ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 27 ఫిబ్రవరి 2024



కోనోకార్పస్ వృక్షాలను తొలగించాలి

శంషాబాద్, ఫిబ్రవరి 26 : తెలంగాణ రాష్ట్రంలోని ఉన్న ఉద్యావనాలు, మున్సిపల్ ప్రాంతాల్లో ఉన్న కోనోకార్పస్ వృక్షాలపై ప్రభుత్వం పరిశోధనలు చేయించి వాటిని తొలగించాలని సోమవారం జిల్లా కలెక్టర్‌కు స్టూడెంట్స్ ఫర్ డెవలప్‌మెంట్ (ఎస్ఎఫ్‌డీ) విద్యార్థులు వినతిపత్రం ఇచ్చారు. ఈ వృక్షాల వల్ల ఊపిరి తిత్తుల సమస్యలతో పాటు చాలా రకాల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. అస్తమా, బ్లైడ్ క్యాన్సర్ వంటి వ్యాధులు కోనోకార్పస్ వృక్షాల వల్లనే వస్తున్నాయని పలువురు శాస్త్రవేత్తలు సైతం పేర్కొంటున్నారని తెలిపారు. ఈ మేరకు విచారణ జరిపించి ఈ వృక్షాలను తొలగించాలని వినతిలో కోరారు.

సబ్సిడీ గ్యాస్.. ఉచిత విద్యుత్!

200 యూనిట్ల ఫ్రీ కరెంట్, రూ.500కే సిలిండర్

- అమల్లోకి మరో రెండు గ్యారంటీలు
- నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- తెల్లరేషన్ కార్డున్న వారంతా ఈ పథకాలకు అర్హులే!
- మార్చి నుంచే 'జీరో' విద్యుత్ బిల్లు



జిల్లాలో గృహ విద్యుత్ వినియోగదారులు : 16,56,990
'గృహజ్యోతి' పథకానికి(200 యూనిట్ల ఉచిత విద్యుత్) వచ్చిన దరఖాస్తులు : 3,99,866
జిల్లాలో రేషన్ కార్డుల సంఖ్య : 5,58,438
(గ్రామీణ : 3,50,130, పట్టణ : 2,08,308)
గ్యాస్ వినియోగదారుల సంఖ్య : 12.3లక్షలు
రూ.500కు గ్యాస్ పథకానికి వచ్చిన దరఖాస్తులు : 4,32,676

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 26): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వంలోకి వచ్చినప్పటి నుంచి రెండు గ్యారంటీలను అమలు చేస్తుంది. మరో రెండు గ్యారంటీల అమలుకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్‌ను పేదలకు వర్తింపజేయనున్నారు. చేవెళ్ల సెంటిమెంట్‌గా ఈ పథకాలను అక్కడి నుంచే అమలుకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ హాజరవుతారని మొదట ప్రచారం జరిగినా.. అనివార్య కారణాల వల్ల ఆమె చేవెళ్ల సభకు రావడం లేదని, ఢిల్లీ నుంచే వర్చువల్‌గా పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడతారని కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉంటే రెండు గ్యారంటీల అమలుకు ఇప్పటికే క్యాబినెట్ సబ్ కమిటీ, ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించి నిర్ణయం తీసుకున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ లబ్ధి చేకూరనుంది. లబ్ధిదారుడు రూ.500కే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించనున్నారు.

లక్షల్లో ఉచిత కరెంటు లబ్ధిదారులు!

జిల్లాలో(కేటగిరి-1) గృహ వినియోగదారులు 16,56,990 మంది ఉండగా 'గృహజ్యోతి' పథకానికి(200 యూనిట్ల ఉచితం) 3,99,866 దరఖాస్తులొచ్చాయి. తెల్ల రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. రేషన్ కార్డులను పరిగణంలోకి తీసుకుంటే జిల్లాలో 5,58,438 మందికి 200యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం వర్తించనుంది. కొత్తగా రేషన్ కార్డుల కోసం, పాత కార్డుల్లో పేర్ల చేర్పు కోసం 71,226 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 46,340రేషన్ కార్డులను ఆమోదించారు. వీరికి రేషన్ కార్డులు వస్తే.. మరో 46వేల పైచిలుకు లబ్ధిదారుల సంఖ్య పెరగనుంది. మొదటి విడత 5.58లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. మార్చి ఒకటి నుంచి తీసే విద్యుత్ బిల్లుల్లో అర్హులైన వినియోగదారులకు 200 యూనిట్ల వరకు జీరో బిల్లులు ఇవ్వాలని నిర్ణయించారు. తెల్ల రేషన్ కార్డు ఉండి 200యూనిట్ల లోపు వాడే గృహ వినియోగదారులందరికీ ఈ పథకం వర్తింపజేస్తారు.

రూ.500కే గ్యాస్ పథకానికీ భారీగా దరఖాస్తులు

జిల్లాలో ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ కంపెనీల ఎల్పీజీ కనెక్షన్‌దారులు మొత్తం 12.3లక్షల వరకు ఉన్నారు. ప్రజాపాలనలో 500కే డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ పథకానికి 4,32,676 దరఖాస్తులొచ్చాయి. ప్రజాపాలనలో గ్యాస్ పథకానికి వచ్చిన దరఖాస్తుల కంటే రేషన్‌కార్డులున్న వారి సంఖ్యే ఎక్కువ ఉంది. జిల్లాలో 5.58లక్షల రేషన్ కార్డులున్నాయి. తెల్లరేషన్ కార్డు, ఆధార్ నంబరు, గ్యాస్ కనెక్షన్ నంబరు, అడ్రస్ తదితర వివరాలు సరిగ్గా ఉన్న వారి జాబితాను ఫైనల్ చేయనున్నారు. ఒక్కో కుటుంబానికి ఏటా ఎన్ని సిలిండర్లు ఇవ్వాలనే అంశంపై ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది. ఒక కనెక్షన్‌దారు మూడేళ్లలో ఎన్ని సిలిండర్లు వినియోగించాడో.. దాని సగటును తీసుకుని కోటాను ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల నుంచి సిలిండర్‌కు రూ.500 తీసుకోనున్నారు. మిగతా డబ్బును ప్రభుత్వం డిస్ట్రిబ్యూటర్లకు చెల్లించనుంది.

కాంగ్రెస్ పార్టీ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తోంది. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10లక్షల వరకు ఉచిత వైద్యంలను అమల్లోకి తెచ్చింది. తాజాగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ స్కీమ్‌లను నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. చేవెళ్లలో మంగళవారం నిర్వహించే సభలో సీఎం ఈ పథకాలను రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తేనున్నారు. చేవెళ్ల సభ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ శశాంక సోమవారం దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వందలాది మంది పోలీసులతో బందో బస్తు ఏర్పాటు చేశారు. సభపూర్తయ్యే వరకు పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.


సభా ప్రాంగణంలో ఏర్పాట్లు

సీఎం సభకు సర్వం సిద్ధం!

భారీ బందోబస్తు

చేవెళ్లలో ప్రభుత్వం నిర్వహిస్తున్న బహిరంగ సభకు పోలీస్ అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సభకు మొత్తం 1,260 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ముగ్గురు డీసీపీలు, 9మంది ఏసీపీలు, 37మంది సీఐలు, 109 మంది ఎస్సైలు, 960 మంది కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొంటున్నారు. వీరు కాక 300మంది ట్రాఫిక్ పోలీసులు సైతం పాల్గొంటున్నారు.

చేవెళ్లలో నేడు రెండు పథకాల అమలుకు శ్రీకారం

- సభ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించిన కలెక్టర్ శశాంక
- లక్ష మంది జన సమీకరణకు అధికారుల చర్యలు
- భారీ బందోబస్తు.. ట్రాఫిక్ ఆంక్షలు


బారికేడ్ల ఏర్పాటు

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, ఫిబ్రవరి 26 : కాంగ్రెస్ పార్టీకి చేవెళ్ల గడ్డ ఓ సెంటిమెంట్. దివంగత వైఎస్సార్ చేవెళ్ల నుంచే ప్రతీ కార్యక్రమాన్నీ ప్రారంభించేవారు. అదే సంప్రదాయాన్ని కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తోంది. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ డిక్లరేషన్ బహిరంగ సభను చేవెళ్ల నుంచే విజయవంతంగా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు గ్యారంటీల్లోని రెండింటిని మంగళవారం చేవెళ్ల నుంచే శ్రీకారం చుట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమయ్యారు. ఇక్కడి ఫరా ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో బహిరంగ సభకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేవెళ్లలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి 200 యూనిట్ల ఉచిత విద్యుత్(గృహజ్యోతి), రూ.500కే గ్యాస్ సిలిండర్(మహాలక్ష్మి) పథకాలను ప్రారంభించనున్నారు. బహిరంగ సభ ఏర్పాట్లను కలెక్టర్ శశాంక దగ్గరుండి పర్యవేక్షించారు. సభ నిర్వహణపై వివిధ శాఖ అధికారులకు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న చేవెళ్ల సభకు అన్ని జిల్లాల నుంచి ప్రజలను తరలించనున్నారు. బహిరంగ సభ సాయంత్రం 5గంటలకు ప్రారంభమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా సభకు ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సభకు లక్ష మంది వచ్చే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. బహిరంగ సభకు వచ్చేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి బస్సుల్లో జనాన్ని తరలించే ఏర్పాట్లు చేశారు. మహాలక్ష్మి పథకానికి ముఖ్యంగా మహిళలను తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. చేవెళ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. బహిరంగ సభ ప్రాంగణంలోనే సీఎం రేవంత్‌రెడ్డి కోసం రెండు హెలీప్యాడ్‌లను సిద్ధం చేశారు. హెలీప్యాడ్, స్టేజి ఏర్పాట్లు, పార్కింగ్ తదితర అంశాలపై కలెక్టర్ పరిశీలించారు.

పలు మార్గాల్లో వాహనాల దారి మళ్లింపు

చేవెళ్లలో నేడు సీఎం సభ ఉన్నందున మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9గంటల వరకు చేవెళ్ల మీదుగా వచ్చే వాహనదారులకు ట్రాఫిక్ ఆంకాక్షలు ఉంటాయని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర పోలీసు అకాడమీ నుంచి చేవెళ్ల మీదుగా వికారాబాద్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ ఎక్స్ రోడ్డు మీదుగా మళ్లిస్తారు. చేవెళ్ల మండలం ఎన్కెపల్లి, ఆలూర్ మీదుగా వికారాబాద్ వైపు వాహనాలు దారి మళ్లిస్తారు. వికారాబాద్ నుంచి చేవెళ్ల, మొయినాబాద్, హైదరాబాద్ వైపు వచ్చే వాహనాలను చేవెళ్ల మండలం ఆలూర్ మీదుగా ఎన్కెపల్లి, ప్రగతి రిసార్ట్ మీదుగా హిమయాత్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు మళ్లిస్తారు. షాబాద్ నుంచి వికారాబాద్ వైపు వెళ్లే వాహనాలను చేవెళ్ల మండలం పామెన, బస్తేపూర్‌ల మీదుగా వికారాబాద్ మళ్లిస్తారు. శంకర్‌పల్లి నుంచి చేవెళ్ల వైపు వచ్చే వాహనాలను ఎన్కెపల్లి రోడ్డు మీదుగా ఆలూర్ నుంచి మళ్లిస్తారు. హిమాయత్‌నగర్ నుంచి చేవెళ్ల వైపు వచ్చే ట్రాఫిక్‌ను ముడిమ్యాల్ స్టేజి నుంచి రావులపల్లి, మల్కాపూర్ మీదుగా చేవెళ్లకు మళ్లిస్తారు. ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

అధికారులు బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలి : కలెక్టర్ శశాంక


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

చేవెళ్లలో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభను అధికారులంతా సమన్వయంతో పనిచేసి విజయవంతం పనిచేయాలని కలెక్టర్ శశాంక సూచించారు. చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేటి సాయంత్రం 5గంటలకల్లా హెలీకాప్టర్‌లో చేవెళ్ల చేరుకుంటారన్నారు. హెలీప్యాడ్ నుంచి నేరుగా ఫరా ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించే బహిరంగసభకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా 200యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాల అమలు కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. బహిరంగ సభ అనంతరం సీఎం తిరిగి వెళ్లే వరకు అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడా చిన్న పొరపాటు జరగకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కలెక్టర్ శశాంక హెలీప్యాడ్, స్టేజ్ ఏర్పాటు, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సాయిరాం, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈవో రంగరావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

అధికారం అడ్డుపెట్టుకొని.. అన్నదాతల నోట్లో మట్టి!

- రూ.2.30కోట్లు కాజేసిన ఏఈవో
- రైతుబీమా, రైతుబంధు పథకాల్లో అక్రమాలు
- కొందుర్గు మండలంలో వెలుగులోకి
- నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు



కొందుర్గు మండల వ్యవసాయ అధికారి కార్యాలయం

షాద్‌నగర్, ఫిబ్రవరి 26 : రైతు సంక్షేమం కోసం పని చేస్తున్నాం.. అన్నదాతను ఆదుకుంటాం.. వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేస్తున్నాం.' ఇవన్నీ గత ప్రభుత్వ భారీ డైలాగులు.. రైతుబంధు, రైతుబీమా పథకాలతో చేతికి డబ్బులందుతుండటంతో రైతులు కూడా ఇది నిజమే అని నమ్మారు. కానీ రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ స్కీముల్లోని స్కాంలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. తాజాగా కొందుర్గు మండలంలో వ్యవసాయ విస్తరణాధికారి(ఏఈవో) రైతు బీమా, రైతుబంధు డబ్బులను కాజేసిన ఉదంతం షాద్‌నగర్ నియోజకవర్గంలో కలకలం రేపుతోంది. ఈ పథకాల్లో జరుగుతున్న అవినీతిని వెలుగులోకి తెచ్చింది. దొరకనంత వరకు అందరూ దొరలే! ఈ దొరల్లో ఇంకెంతమంది దొంగలున్నారో? అన్న విషయం ప్రస్తుతం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఈ డబ్బు కాజేసిన వ్యవహారం వివరాల్లోకి వెళ్లితే...

ఆది నుంచి విమర్శలే..

రైతుబంధు గొప్ప పథకం అని గత ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. 2018లో టీఆర్ఎస్ ప్రభుత్వం గెలవడానికి కూడా ఈ పథకం ఉపయోగపడింది. కానీ రానురాను ఈ పథకంపై విమర్శలొచ్చాయి. వ్యవసాయం చేయకపోయినా భూమి ఉన్న వారందరికీ వేలల్లో డబ్బులు ఖాతాల్లోకి వెళ్లిపోయాయి. రైతుబంధు, రైతుబీమా పథకాలను ప్రజాప్రతినిధులు, మంత్రులు, సినీ నటులు ఇలా అందరికీ వర్తింపజేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా ప్లాట్లను సాగు భూమిగా చూపించి రైతుబంధు తీసుకున్న దాఖలాలూ వెలుగు చూస్తున్నాయి. భూస్వాములకు రైతుబంధు ఇస్తూ ప్రజాధనాన్ని దిగమింగుతున్నారని చిన్న, సన్నకారు రైతులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సైతం ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడి కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో రైతుబంధు, రైతుబీమా పథకాల్లో చోటుచేసుకున్న కుంభకోణాలు ఒక్కోటి వెలుగులోకి వస్తున్నాయి.

భూమి కొనుగోలు కోసం అక్రమాలు

కొందుర్గు మండలం తంగళ్లపల్లి క్లస్టర్‌లో వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ)గా పనిచేస్తున్న గోరేటి శ్రీశైలం, అతడి స్నేహితుడు క్యాబ్ డ్రైవర్ వీరస్వామితో కలిసి రైతుబీమా, రైతుబంధు డబ్బులు సుమారు రూ.2కోట్లను అక్రమంగా తన ఖాతాలోకి జమ చేసుకున్నాడని ఎల్ఐసీ అధికారుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసులు గత శనివారం అతడిని కడ్తాల్ మండలంలో అరెస్టు చేశారు. అనంతరం పోలీసుల విచారణలో అనేక అక్రమాలు వెలుగులోకొచ్చాయి. తంగళ్లపల్లి క్లస్టర్‌లోని పాత ఆగిర్యాల, ఆగిర్యాల, విశ్వనాథ్‌పూర్, వెంకిర్యాల గ్రామాలకు చెందిన 20 మంది రైతుల పేరిట రైతుబీమా డబ్బును కాజేసేందుకు నకిలీ పత్రాలు సృష్టించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇందులో 18 నుంచి 60ఏళ్లు దాటిన వారి ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీలను మార్చి బతికి ఉన్న వారిని కూడా చనిపోయినట్లు చూపి రూ.1.3కోట్లు కొల్లగొట్టాడు. ఈ డబ్బులను వివిధ ప్రాంతాల్లో గల 7 జాతీయ బ్యాంకుల బ్రాంచీల్లో ఖాతాలు తెరిచి డబ్బును అందులో జమ చేయించారు. అలాగే అదే క్లస్టర్ పరిధిలో 130 రైతుల రైతుబంధు డబ్బులు కోటి రూపాయలను వివిధ పేర్లతో తన బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించాడు. శ్రీశైలం కొల్లగొట్టిన రైతుబంధు, రైతుబీమా డబ్బులతో చౌదరిగూడ మండలం తుమ్మలపల్లిలోని 88 సర్వే నంబర్‌లో 8.20ఎకరాలు, కొందుర్గులో 2.35ఎకరాల భూమి కొన్నాడు. ఈ భూముల విలువ ప్రస్తుతం రూ.10కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. తనకు వ్యవసాయ భూములు లేకపోవడం, ఎలాగైనా భూములు కొనాలనే లక్ష్యంతోనే ఈ అక్రమాలకు పాల్పడ్డానని శ్రీశైలం పోలీసులకు తెలిపాడు.

రాబంధుల చేతుల్లోకి రైతుబంధు

వ్యవసాయం చేసే రైతుల కోసం ఉద్దేశించిన రైతుబంధు పథకం రాబందుల చేతుల్లోకి వెళ్లి కోట్లాది రూపాయలు దండుకున్నట్లు తెలుస్తోంది. కొందుర్గు మండల ఏఈఓ శ్రీశైలం రైతుబీమా, రైతుబంధు పథకాల్లో రూ.2కోట్లకుపైగా అక్రమాలకు పాల్పడ్డారన్న సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అరెస్టు చేయడంతో ఈ ఆరోపణలకు బలం చేకూరింది. ఒక్క కొందుర్గు మండల పరిధి ఒక్క క్లస్టర్‌లోనే కోట్లాది రూపాయల అవినీతి జరిగిందంటే, మిగితా ప్రాంతాల్లో, ఇతర మండలాల్లో ఎంత అవినీతి జరిగి ఉంటుందో అనే చర్చ సాగుతోంది. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ చాలమంది రైతులకు రైతుబంధు ఇవ్వకపోవడం గతంలో చూశాం. అలాంటిది ఒక్క ఏఈవో వంటి చిరుద్యోగి తప్పుడు పత్రాలు, ఫేక్ బ్యాంక్ ఖాతాలను తెరచి కోట్ల మేర ఎలా కాజేశాడన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇతడికి వ్యవసాయ శాఖలోని ఉన్నతాధికారులెవరైనా సహకరించారా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది. 2020 నుంచి ఈ తతంగం జరుగుతుంటే ఉన్నతాధికారులు ఏ చేస్తున్నారన్నదానిపైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే తరహాలో జిల్లాలో, రాష్ట్రంలో వేరే చోట్ల కూడా అక్రమాలు జరిగి ఉంటాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోం ది. ప్రస్తుతం ప్రత్యేక పోలీసు బృందాలు, వ్యవసాయ ఉన్నతాధికారులు వీటిని వెలికి తీసేలా విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.


మరింత లోతుగా విచారణ

శ్రీశైలం, అతడి మిత్రుడిపై సైబరాబాద్ పోలీసులు ఆర్థికనేరాల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మరిన్ని వివరాలు సేకరించేందుకు వారిని కోర్టు అనుమతితో పోలీస్ కస్టడీకి తీసుకోనున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి సోమవారం తెలిపారు. కస్టడిలోకి తీసుకున్న అనంతరం ఈ కేసులో ఇంక ఎవరెవరి హస్తం ఉన్నట్లు విచారిస్తామన్నారు. ఇలాంటి అక్రమాలు ఇంకా ఎక్కడైనా జరిగాయా అన్న కోణంలో దర్యాప్తు చేసేందుకు వ్యవసాయ అధికారుల సహకారం తీసుకొని విచారిస్తామని సీపీ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగానూ ఇలాంటి ఘటనలు జరిగాయా? అన్న కోణంలోనూ చర్యలకు ప్రభుత్వం పరిశీలించనుందని తెలిపారు.


సమస్యలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమివ్వాలి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 26: ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యమిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 82ఫిర్యాదులొచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేసి, సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల వివరాలను నమోదుకై రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. రిజిస్టర్‌లో నమోదు చేయడం ద్వారా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, వాటిలో ఎన్ని పరిష్కరించాం, పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయని అనే వివరాలు తెలుస్తాయన్నారు. అధికారులు ప్రజావాణి రిజిస్టర్‌ను తప్పక మెయింటేన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కృష్ణన్నా.. పంచకట్టు బాగుంది!

- మహేశ్వరం వాసులు ఏమంటున్నరు?
- పార్టీ బలోపేతానికి మీ సహకారం కావాలి
- తీగల కృష్ణారెడ్డితో సీఎం రేవంత్‌రెడ్డి మాటామంతీ

మహేశ్వరం, ఫిబ్రవరి 26 : మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు జడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ అనితా హరినాథ్‌రెడ్డి సోమవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛంతో అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తీగలతో సీఎం మాట్లాడుతూ.. 'కృష్ణన్నా నీ పంచకట్టు బాగుంది. మహేశ్వరం ప్రజలు ఏమంటున్నరు? నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మీ సహకారం కావాలి.' అని నవ్వుతూ పలకరించారు. ముఖ్యమంత్రిని కలిసిన సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంతో పాటు రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు పాటు పడుతామన్నారు. అందుకు ఎల్లవేళలా కాంగ్రెస్ అధినాయకత్వం అండదండలతో పాటు ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారని తీగల కృష్ణారెడ్డి తెలిపారు.

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

పరిగి, ఫిబ్రవరి 26 : పరిగిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పూర్తి సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం దేవాలయ ఆవరణలో ఉత్సవాలకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు గతంలో ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో జరిగేవని, ఈ సారి నుంచి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుండడం శుభపరిణామమని చెప్పారు. గతం కంటే భిన్నంగా పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించాలని, అందుకు తాను అన్ని రకాలుగా సహకారం అందిస్తానని తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మార్చి 18, 19, 20 తేదిల్లో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యదర్శి శ్రీనివాస్ చెప్పారు. ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, సీఐ ఎన్.శ్రీనివాస్, పురోహితడు పార్థసారథి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంత్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, మండలాధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి, నాయకులు ఎస్‌పి బాబయ్య, బీఎస్ అంజనేయులు, పాలాది శ్రీనివాస్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

దేవాలయం గురించి ఎమ్మెల్యే ఆరా..

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని పలు విషయాల గురించి స్థానిక పురోహితుడి ద్వారా ఎమ్మెల్యే ఆరా తీశారు. హుండీ, నెలవారీ ఆదాయం, దేవుడి అభరణాలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఆలయ భూములను ఆక్రమిస్తే చర్యలు

కడ్తాల్, ఫిబ్రవరి 26 : ఆలయాల భూములను ఆక్రమించినా, వాటిలో అక్రమ నిర్మాణాలు చేపట్టినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని దేవాలయ భూముల పరిరక్షణ డిప్యూటీ కలెక్టర్ అనిత, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ హెచ్చరించారు. కడ్తాల గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయాల భూములను సోమవారం వారు పరిశీలించారు. ఆలయ భూమికి కంచె ఏర్పాటు పనులు చేపట్టగా రెండు రోజుల క్రితం అన్మాస్‌పల్లి, సాయిరెడ్డిగూడ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఆ పనులను నిలిపివేయించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జిల్లా దేవాదాయ శాఖ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా దేవాలయ భూముల పరిరక్షణ డిప్యూటీ కలెక్టర్ అనిత, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఈవో మోహన్‌రావులు అన్మాస్‌పల్లి గ్రామానికి చేరుకొని ఆలయ భూములను పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. ఆలయాల భూముల పరిరక్షణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం పోచమ్మగడ్డ తండా సమీపంలో సర్వే నెంబర్ 120లో దేవాలయ భూమిని వారు పరిశీలించారు. ఆ తర్వాత సర్వే నెంబర్ 76లో గల ఆలయ భూమిని పరిశీలించారు. ఆ భూమిని సర్వే చేయించి కంచె ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. కాగా ఆలయ భూమిలో రహదారికోసం స్థలాన్ని కేటాయించాలని స్థానికులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పాలాది ఆంజనేయులు, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, దేవాదాయశాఖ అధికారులు కృష్ణగౌడ్, బోడ్యనాయక్, ఆంజనేయులు, నాయకులు భాస్కర్‌రెడ్డి, సాయిరెడ్డి, యాదయ్యగౌడ్, మాజీ సర్పంచ్ శంకర్, ఎగిరిశెట్టి బాబు, బీక్యనాయక్, జగన్, దేవాదాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.


ఆలయ భూములను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ ప్రత్యేక డిప్యూటి కలెక్టర్ అనిత

శివాలయం అభివృద్ధికి సహకరిస్తా : ఎమ్మెల్యే

తాండూరురూరల్, ఫిబ్రవరి 26 : తాండూరు మండల పరిధిలో బొంకూరులోని శివాలయం అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామ సమీపంలోని పురాతన శివాలయాన్ని శివభక్తులు రాములు, శ్రీను, దాతల సహాయంతో పునఃనిర్మాణం చేపట్టారు. సోమవారం ఆలయంలో శివుడు, నంది విగ్రహం, కలశం, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన చేశారు. ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు.


శివస్వాములతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

రామాయణం, భగవద్గీతపై అవగాహన కలిగి ఉండాలి

యాలాల, ఫిబ్రవరి 26 : రామాయణం, భగవద్గీతపై ప్రతీ హిందువు అవగాహన కలిగి ఉండాలని చెవేళ్ళ మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం యాలాల మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో గీతజ్ఞానయజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రామాయణ, భగవద్గీతల గురించి వివరించారు. అనంతరం ఆయన జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


యజ్ఞం నిర్వహిస్తున్న పండితులు

భాషా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 26 : భాషా నైపుణ్యాన్ని పెంపొందించుకుని ముందుకు సాగితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని యాదాద్రి - భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం, వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో స్పెల్ విజర్డ్ అండ్ డ్రామా కాంపిటిషన్ - 2024ను నిర్వహించారు. ఈ పోటీల ముగింపునకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లీషులో పట్టుసాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎల్టా ఎంతగానో కృషి చేస్తోందన్నారు. పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 23,144 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎల్టా ఫౌండర్ కొమురయ్య, ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, యూనివర్సిటీ హెచ్‌వోడీలు అనంతలక్ష్మి, శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు.


బహుమతులను అందజేస్తున్న డీఈవో

కూతురి చదువుకు రుణం కోసం ఫోన్‌చేసి..
సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కిన తండ్రి

» రూ. 1,37,000లు పోగొట్టుకున్న వైనం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా రుణం పొందడం కోసం గూగుల్ చేసి.. కనిపించిన నంబర్లకు ఫోన్ చేసి, ఆవలి వ్యక్తుల మాటల్లో పడిపోయారో.. రుణం మాట దేవుడెరుగు, ఉన్న డబ్బంతా ఖాళీ అవ్వొచ్చు! మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌కు చెందిన వేణుగోపాల్ రెడ్డి అనే 52 ఏళ్ల వ్యక్తి ఇలానే నిండా మునిగారు. ఆయన.. తన కూతురు ఉన్నత చదువుల కోసం అప్పు చేయాలనుకున్నారు. నిరుడు డిసెంబరులో 'జస్ట్ డయల్ సర్వీసు'కు ఫోన్ చేసి తనకు రూ.30 లక్షల రుణం కావాలని అడిగారు. తర్వాత వేణుగోపాల్ రెడ్డికి 'బజాజ్ ఫైన్ సర్వీస్' నుంచి అమిత్ అగర్వాల్ పేరుతో ఫోనొచ్చింది. 'మీరు మీ అమ్మాయి ఉన్నతవిద్య కోసం రూ.30లక్షల రుణం అడిగారని తెలిసింది. మా కంపెనీ నుంచి రుణం ఇస్తాం, ఇందుకు ప్రాసెసింగ్ ఫీజు రూ.15వేలు చెల్లించాలి' అని ఆవలి వ్యక్తి చెప్పాడు. నిజమేనని నమ్మిన వేణుగోపాల్‌రెడ్డి 2023 డిసెంబరు 22న రూ.15వేలు పంపారు. తర్వాత బజాజ్ ఫైన్ సర్వీస్ నుంచి ఆ వ్యక్తే మళ్లీ ఫోన్‌చేసి.. బీమా లేకుండా రుణం మంజూరైందని, బీమా కావాలంటే రూ.47,500 పంపాలని చెప్పారు. ఆ మొత్తాన్ని 2023 డిసెంబరు 25వ తేదీన వేణుగోపాల్ రెడ్డి ట్రాన్స్‌ఫర్ చేశారు. జీఎస్టీ కోసం మరో రూ.75వేలు అడిగితే కూడా పంపారు. ఇలా మొత్తం రూ.1.37 పంపించారు. ఆ మరుసటి రోజు అమిత్ అగర్వాల్ ఫోన్ చేసి మరిన్ని డబ్బులు అడగటంతో అనుమానం వచ్చి ఆన్‌లైన్‌లో విచారించగా అదంతా మోసమని తెలిసింది. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తికోసం ప్రయత్నించగా స్పదించకపోవడంతో మోసపోయానని వేణుగోపాల్ రెడ్డి గ్రహించారు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రష్యా సైన్యం నుంచి భారత హెల్పర్లు తిరిగి రాక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: రష్యా సైన్యంలో 'సెక్యూరిటీ హెల్పర్లు'గా పనిచేస్తున్న భారతీయులను అక్కడి ప్రభుత్వం తిప్పిపంపింది. భారత ప్రభుత్వ డిమాండును మన్నించి వారిని వెంటనే ఆర్మీ నుంచి పంపించివేసిందని సోమవారం విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటించింది. భారత్‌కు చెందిన కొందరు వ్యక్తులు రష్యా సైన్యంలో సహాయ సిబ్బందిగా నియమితులయ్యారు. అయితే ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొనాలని ఒత్తిడి చేయడంతో వారిలో ఆందోళన మొదలయింది. తమను ఆదుకోవాలని రష్యాలోని భారత రాయబార కార్యాలయాన్ని కోరారు. ఈ సమస్యను ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. విదేశీ వ్యవహారాల శాఖ చేసిన కృషి ప్రయత్నంగా రష్యా ప్రభుత్వం వారిని తిప్పి పంపించడానికి సిద్ధమయింది. వారిలో కొందరు ఇప్పటికే స్వదేశానికి పయనమయ్యారు. భారతీయులు ఎవరూ యుద్ధ క్షేత్రంలో విధులకు వెళ్లకూడదంటూ గత వారమే విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ హెచ్చరించడం గమనార్హం.

ట్రూకాలర్‌లో ఏఐ ఆధారిత కాల్ రికార్డింగ్ ఫీచర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: స్వీడన్‌కు చెందిన కాలర్ ఐడెంటిఫికేషన్ యాప్ ట్రూకాలర్.. భారత్‌లో ఆర్టిఫీషియల్ ఆధారిత (ఏఐ) ఆధారిత కాల్ రికార్డింగ్ ఫీచర్‌ను ప్రారంభించినట్టు సోమవారం ప్రకటించింది. ఏఐ కాల్ రికార్డింగ్ అనేది పెయిడ్ (చెల్లింపు) ఫీచర్ అని, ఇది ట్రూకాలర్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌లో అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజ్‌లలోఇది పని చేస్తుందని తెలిపింది. ప్రీమియం ప్లాన్‌లో భాగంగా ఏఐ ఆధారిత కాల్ రికార్డింగ్ సదుపాయం నెలకు రూ.75తో లేదా ఏడాదికి రూ.529తో ప్రారంభం అవుతుందని పేర్కొంది.

కార్తీ చిదంబరంపై ఈడీ తాజా చార్జిషీటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరంపై ఈడీ తాజాగా మరో ఛార్జిషీటు దాఖలు చేసింది. ఆయన తండ్రి పి.చిదంబరం కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు 2011లో చైనా జాతీయులకు అక్రమంగా వీసాలు ఇప్పించారంటూ కేసు నమోదు చేసింది. దీనిపై మార్చి 16న విచారణ జరపనున్నట్టు ప్రత్యేక న్యాయస్థానం తెలిపింది.

వనపర్తి మునిసిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాసం

» కలెక్టర్‌కు నోటీసు అందజేసిన కౌన్సిలర్లు

» తిరుమలగిరి ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌లపై కూడా..



కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేస్తున్న కౌన్సిలర్లు

వనపర్తి టౌన్, తిరుమలగిరి, ఫిబ్రవరి 26: వనపర్తి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. బీఆర్ఎస్‌కు చెందిన ఛైర్మన్ గట్టుయాదవ్, వైస్ ఛైర్మన్ వాకిటి శ్రీధర్‌కు వ్యతిరేకంగా ఆ పార్టీ కౌన్సిలర్లు సోమవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలిసి అవిశ్వాసానికి సంబంధించిన నోటీసు అందజేశారు. వీరికి కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలపడంతో బల నిరూపణ జరిగే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తర్వాత బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధం కాగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అసమ్మతి కౌన్సిలర్లతో చర్చలు జరిపారు. మూడుసార్లు ఈ చర్చలు జరిగాయి. చివరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి అవిశ్వాసానికి నోటీసు అందజేశారు. వనపర్తి మునిసిపాలిటీలో 33 వార్డులు ఉండగా కాంగ్రెస్ నుంచి 9 మంది, టీడీపీ నుంచి ఒకరు, బీఆర్ఎస్ నుంచి 23 మంది కౌన్సిలర్లున్నారు. కలెక్టర్‌కు ఇచ్చిన నోటీసులో 15 మంది బీఆర్ఎస్, ఏడుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఒక టీడీపీ కౌన్సిలర్ సంతకాలు చేయగా కాంగ్రెస్ నుంచి ఇద్దరు, 8 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు సంతకాలు చేయలేదు. బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు కాంగ్రెస్ మద్దతు తీసుకోవడంతో బలనిరూపణ తర్వాత కొత్తగా ఎన్నికయ్యే వారు బీఆర్ఎస్‌లోనే ఉంటారా లేక కాంగ్రెస్‌లోకి వెళ్తారా అనేది తేలనుంది.

'తిరుమలగిరి' ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌లపైనా...

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపల్ ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌లపై అవిశ్వాసానికి రంగం సిద్ధమైంది. సోమవారం 8 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ వెంకటరావును కలిసి అవిశ్వాస తీర్మాన పత్రాలు అందజేశారు. తిరుమలగిరి మునిసిపాలిటీలో 15వార్డులుండగా.. బీఆర్ఎస్ నుంచి ఎనిమిది, కాంగ్రెస్ నుంచి ఆరు, బీజేపీ నుంచి ఒక కౌన్సిలర్ ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన పోతరాజు రజనీ, సంకేపల్లి రఘునందన్‌రెడ్డి ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. మునిసిపల్ పాలనా వ్యవహారాల్లో ఛైర్‌పర్సన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. అవినీతికి పాల్పడుతూ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడంలేదంటూ 8 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం ప్రతిని అందజేశారు. దీన్ని పరిశీలించి సమావేశం నిర్వహణ తేదీ నిర్ణయిస్తామని కలెక్టర్ తెలిపారని కౌన్సిలర్ ఎల్సోజు నరేష్ చెప్పారు.

మా పొత్తు సూపర్‌హిట్

చెడగొట్టేందుకు శతవిధాలా జగన్ యత్నాలు: చంద్రబాబు



శ్రీకాకుళం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'టీడీపీ-జనసేన కాంబినేషన్ సూపర్‌హిట్. వైసీపీకి ప్యాంట్లు తడిసిపోతున్నాయి' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. తమ మధ్య పొత్తు కుదరకుండా చెడగొట్టడానికి సీఎం జగన్ శతవిధాలుగా ప్రయత్నించాడని.. ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా కుట్రలు పన్నుతున్నాడని ధ్వజమెత్తారు. 'రా కదలిరా' కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం ఇక్కడ భారీ బహిరంగ సభ నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, మాజీ మంత్రులు కిమిడి కళావెంకట్రావు, గుండ అప్పల సూర్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, కోండ్రు మురళీమోహన్, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, కలమట వెంకటరమణ, బగ్గు రమణమూర్తి, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈ పొత్తు తన కోసమో, పవన్ కల్యాణ్ కోసమో కాదని.. ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం కోసమేనని చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. 'మా పొత్తును ప్రజలు ఆమోదించారు. మాకూ అవగాహన ఉంది. మధ్యలో మీకేంటి బాధ? కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. వైసీపీవి నీచ, చవట రాజకీయాలు. అందుకే ఆ పార్టీకి స్వస్తి పలకాలి. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా అందరం కృషిచేద్దాం' అని పిలుపిచ్చారు. జగన్‌ను ఉత్తరాంధ్ర ద్రోహిగా అభివర్ణించారు. జీవితంలో వాస్తవాలు చెప్పడని.. అబద్ధాలు చెప్పడంలో పీహెచ్‌డీ చేశాడని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాలో కుట్రలకు పాల్పడుతున్నాడని.. కులాల మధ్య చిచ్చుపెడుతున్నాడని దుయ్యబట్టారు. సైకో పాలనతో రాష్ట్రం నిరుద్యోగంలో నంబర్ వన్ అయిందన్నారు. 'రాష్ట్రంలో ఏ ఒక్కరికీ భద్రత లేదు. చివరకు మీడియాకూ భద్రతలేదు. వారిపైనా దాడులు చేయిస్తున్నాడు. వారికి వ్యతిరేకంగా జీవో 243 తీసుకొచ్చాడు'అని ధ్వజమెత్తారు. ఇంకా ఏమన్నారంటే..

కొత్త నాటకాలు..

ఈ జగన్ కొత్తనాటకాలకు తెరతీశాడు. పేదల మనిషంట! వేల కోట్లను దోచుకుని.. పేదల పథకాలను రద్దు చేసి పేదల ప్రతినిధినని చెప్పుకొంటున్నాడు. నువ్వు ఏవిధంగా పేదల మనిషివి? ప్రజలను అంతం చేయాలని చూస్తున్న భస్మాసురుడివి. తొమ్మిది దఫాలు విద్యుత్ చార్జీలు పెంచావు. పేదలపై రూ.65 వేల కోట్ల భారం మోపావు. ఇందుకేనా సిద్ధమని ప్రగల్భాలు పలుకుతున్నావు. 24 గంటలపాటు కరెంట్ ఇచ్చావా? నువ్వు మాత్రం రూ.20 కోట్లతో బుల్లెట్ ప్రూఫ్ బస్సులు కొనుక్కున్నావు. హెలికాప్టర్లో తిరుగుతూ.. పోలీసులను, పరదాలను అడ్డుపెట్టుకుని ప్రజల్లోకి వస్తున్నావు. పేదలకు అన్నం పెడితే సహించలేక అన్న క్యాంటీన్లను తొలగించేశావ్. అప్పట్లో రూ.50 ఉండే మద్యం క్వార్టర్.. ఇప్పుడు రూ.200 చేసేశావు. నాసిరకం మద్యం విక్రయిస్తూ పేదల రక్తం తాగుతున్న నువ్వు పేదల ప్రతినిధివి ఎలా అవుతావ్? మేం ఉచితం ఇసుకను ఇస్తే.. ఇప్పుడు మంత్రులు, మీ పార్టీ నాయకులు పంచుకుంటున్నారు. దొంగలని ఎవరిని అనాలి?

వైసీపీకి అభ్యర్థుల్లేరు..

వైసీపీ తరఫున పోటీకి అభ్యర్థులు కూడా లేరాయె! మొన్నటివరకు ఒక్కో లిస్టు రిలీజ్ చేసేసి సిద్ధం అన్నాడు. ఇప్పుడు మాట మార్చి ఆ లిస్టుల్లోని వారు కేవలం నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు అని, అభ్యర్థులు కారని చెబుతున్నారు. నేను అభ్యర్థుల ఎంపిక విషయంలోనూ పారదర్శకంగా ఉన్నా. ఫోన్ ద్వారా అభ్యర్థులను ప్రజల ముందుంచాను.. వైసీపీని ఇంటికి పంపించేయాలన్నదే అందరి ధ్యేయం. రాష్ట్రంలో మీడియాకు కూడా స్వేచ్ఛ లేకుండా పోయింది. వాస్తవాలను చూపిస్తున్న వారిపై దాడులకు పాల్పడుతున్నారు. వైసీపీ సభలో నాది, పవన్ కల్యాణ్ ఫొటోలతో కటౌట్లు పెట్టించి వాటిపై దాడులు చేయించారు. మానసిక రోగులు మాత్రమే ఇలాంటి పనులు చేస్తారు. మా సభలో జగన్ రెడ్డి బొమ్మ పెట్టించి కొట్టించలేమా? అది సభ్యత కాదు. చొక్కా చేతులు మడతపెట్టమని అంటున్నాడు. జగన్‌రెడ్డీ.. మీరు చొక్కా మడతపెడితే మా తమ్ముళ్లు కుర్చీలు మడతపెడతారు. నీకు కుర్చీ లేకుండా చేస్తారు. మిడిసిపడితే బట్టలు విప్పించి తరిమి తరిమి కొట్టే ధైర్యం మా తమ్ముళ్లకు ఉంది.

మాజీ మంత్రి సోమిరెడ్డిపై హత్యాయత్నం

» గడ్డపారతో దాడికి యత్నించిన వైసీపీ సానుభూతిపరుడు


» అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలు, తోపులాట

» పోలీసులకు సోమిరెడ్డి ఫిర్యాదు

» 11 మంది టీడీపీ కార్యకర్తలపై కేసు..!

నెల్లూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగింది. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కట్టువపల్లిలో సోమవారం సాయంత్రం వైసీపీ సానుభూతిపరుడు బల్లి వెంకటయ్య గడ్డపారతో సోమిరెడ్డిపైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన టీడీపీ కార్యకర్తలు వెంకటయ్యను అడ్డుకున్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం కట్టువపల్లిలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమిరెడ్డి వస్తున్న నేపథ్యంలో ఆదివారం రాత్రే స్థానిక టీడీపీ నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరుడు బల్లి వెంకటయ్య టీడీపీ ఫ్లెక్సీలను చించి చెరువులో పడేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు సోమవారం ఉదయం మరోమారు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా మళ్లీ వాటినీ చించేశారు. సాయంత్రం 4 గంటల సమయంలో సోమిరెడ్డి కట్టువపల్లికి చేరుకోగా మద్యం మత్తులో ఉన్న వెంకటయ్య వీరంగం సృష్టించాడు. అసలు మా గ్రామానికి టీడీపీ వాళ్లు ఎందుకొస్తున్నారు..? అంటూ కేకలు వేశాడు. బాణాసంచా కాలుస్తున్న టీడీపీ కార్యకర్తను కొట్టాడు. గ్రామస్థులు, వెంకటయ్య బంధువులు ఎంత నచ్చజెప్పినా ఆయన పట్టించుకోకుండా రచ్చరచ్చ చేశాడు. చివరకు టీడీపీ కార్యకర్తలు కూడా తిరగబడటంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత సోమిరెడ్డి గ్రామంలో పర్యటిస్తూ గుడిలో పూజలు నిర్వహించి బయటకు వస్తుండగా వెంకటయ్య గడ్డపార తీసుకొని అక్కడికి వచ్చాడు. గడ్డపారను తిప్పుతూ వీరంగం సృష్టించాడు. సోమిరెడ్డిపైకి దూసుకొచ్చేందుకు ప్రయత్నించగా టీడీపీ కార్యకర్తలు అడ్డుకొని వెంకటయ్యకు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన ఒక్కసారిగా గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. అక్కడి నుంచే సోమిరెడ్డి జరిగిన విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు గ్రామానికి చేరుకున్నారు. ఆ తర్వాత కార్యక్రమాన్ని సోమిరెడ్డి ప్రశాంతంగా ముగించారు. అయితే ఈ కార్యక్రమం ముగిశాక వైసీపీ నాయకులు వెంకటయ్య చేత పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా 11 మంది టీడీపీ కార్యకర్తలపై హత్యాయత్నం కేసు(సెక్షన్ 307) నమోదు చేసినట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం దీనిని బయటకు చెప్పడం లేదు. ఫిర్యాదిదారుడిని ఆసుపత్రికి తరలించామని, వైద్యుల రిపోర్టు ప్రకారం కేసు నమోదు చేస్తామని చెబుతున్నారు. అయితే వీరంగం సృష్టించిన వెంకటయ్యపై నెల్లూరు జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలిసింది.





రెడ్డిపల్లి గ్రామంలోని పంట పొలాల మధ్య కింది నుంచి ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 26 : మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో పంటపొలాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. చేతికి అందేంత ఎత్తులో ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలపై ప్రమాదకరంగా వేలాడుతున్న తీగలను తొలగించాలని ఏడాదిగా విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని బాధిత రైతు నవీన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వెంటనే కరెంటు వైర్లను సరిచేయాలని రైతులు కోరుతున్నారు. లేనియెడల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

సేవాలాల్ మహరాజ్ క్రికెట్ కప్ విజేత ఇబ్రహీంపట్నం జట్టు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని ఎల్‌బీస్టేడియంలో మూడు రోజులుగా నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ క్రికెట్ కప్ పోటీల్లో కెఎస్‌ఎం ఇబ్రహీంపట్నం జట్టు విజేతగా నిలిచింది. మాజీ ఎంపీ వి.హనుమంతరావు విజేతకు ట్రోఫీతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతి, రన్నర్‌గా నిలిచిన శంషాబాద్ జట్టుకు యాభై వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కేంద్రాల్లో 15 ఎకరాల విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని కోరారు. టోర్నమెంట్ నిర్వాహకుడు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ గిరిజన క్రీడాకారులను ప్రోత్సహించడానికి సేవాలాల్ మహరాజ్ జ్ఞాపకార్థం పోటీలను నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, వెయిట్ లిఫ్టర్ సుకన్య, రాజేందర్‌నాయక్, భరత్‌చంద్రారెడ్డి, నవీన్‌నాయక్, అయ్యప్ప, దిలీప్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం జట్టుకు కప్పు అందజేస్తున్న మాజీ ఎంపీ వీహెచ్ తదితరులు

ప్రయాణికులకు అనుగుణంగా
సౌకర్యాలు పెంచాలి

» అమృత్ భారత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, చిత్రంలో మున్సిపల్ ఛైర్మెన్ కొందూటి నరేందర్

షాద్‌నగర్, ఫిబ్రవరి 26 : పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రైళ్లు, రైల్వే స్టేషన్లలో సౌకర్యాలను కల్పించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం షాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ సమావేశంలో రైల్వే స్టేషన్ల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. షాద్‌నగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.9.59కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధుల మాటలు నమ్మి అనవసరమైన చోట రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌ల నిర్మాణాలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి డిజైన్‌లు రూపొందించి ఆ తర్వాత అలైన్‌మెంట్ మార్చడం శ్రేయస్కరం కాదన్నారు. రైల్వే ఇంజినీరింగ్ అధికారులు కూడా ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేయాలని సూచించారు. రైల్వే ట్రాక్ కింద నిర్మించే అండర్ పాస్ బ్రిడ్జిలు ప్రయాణికులకు పెద్దగా ఉపయోగకరంగా ఉండటం లేదని, చిన్నపాటి వర్షాలు కురిసినా అండర్ పాసుల్లో నీరు చేరి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. కార్యక్రమలో మున్సిపల్ ఛైర్మన్ కె.నరేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, అధికార ప్రతినిధి వెంకటేష్‌గుప్తా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, ఎ.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానించి అవమానిస్తారా? : బీజేపీ నాయకులు

అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ సమావేశంలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు సోమవారం ప్రారంభోత్సవం చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమానికి తమను ఆహ్వానించి స్టేజీ మీదకి పిలువకుండా అవమానిస్తారా? అని బీజేపీ నేతలు, రైల్వే బోర్డు మెంబర్ అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డిని స్టేజిపైకి ఆహ్వానించాలని స్థానిక బీజేపీ నాయకులు బాబయ్య, వెంకటేశ్‌గుప్తాలు విజ్ఞప్తి చేసినా రైల్వే అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అలాగే షాద్‌నగర్‌కు చెందిన సీనియర్ సిటిజన్ నాగిళ్ల గోపాల్ గుప్తా ఆవేశానికి లోనై స్టేజీ మీద అమర్చిన మైక్‌ను ఆఫ్ చేసి నిరసన వ్యక్తం చేశారు. అసహనానికి గురైన బొక్క నర్సింహారెడ్డి కార్యక్రమం మధ్యనే వెనుతిరిగి వెళ్లిపోయారు. రైల్వే బోర్డు మెంబర్ కూడా తన పదవికి రాజీనామా చేస్తానంటూ మధ్యలోనే వెళ్లిపోయారు. ప్రధానమంత్రి వర్చువల్ కార్యక్రమం రసాభాసగా మారడంతో ఆహ్వానితులు అసంతృప్తి వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్యను పెంచాలి

» డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి


కొందుర్గు, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్యను పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల టార్గెట్‌ను పూర్తి చేయాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు అమృతా జోసఫ్, డాక్టర్ తబస్సుమ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ ప్రగతికి బ్రేక్!



» 8నెలలుగా విడుదల కాని నిధులు.. పనులకు ఆటంకం

» తాండూరు మున్సిపాలిటీకే రెండు కోట్ల బకాయిలు » కొత్త సర్కారైనా నిధులు విడుదల చేస్తుందా



తాండూరు, ఫిబ్రవరి 26 : నిధుల కొరతతో పట్టణాభివృద్ధికి బ్రేక్ పడింది. ఎనిమిది నెలలుగా ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. ఆర్థిక సంఘం, పట్టణప్రగతి నిధులు మున్సిపాలిటీలకు ఎంతో ఉపయోగపడుతాయి. అవి కూడా నిలిచిపోయాయంటే మున్సిపాలిటీల ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. పెద్ద మున్సిపాలిటీలకు సొంత వనరులుండగా, కొత్తగా ఏర్పడిన, చిన్న మున్సిపాలిటీలకు నిధులు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వికారాబాద్ జిల్లాలో తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీలున్నాయి. వీటికి 2023 జూలై నుంచి పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోయాయి. వాటి విడుదలకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఆయా మున్సిపాలిటీలు ఎదురు చూస్తున్నాయి. నిధుల లేమి కారణంతో మున్సిపాలిటీ పరిధిలో చేసిన పనులకు బిల్లుల కోసం వస్తున్న కాంట్రాక్టర్లకు సమాధానం చెప్పలేక అధికారులు తలపట్టుకుంటున్నారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారని, బిల్లులు రాకుండా పనులు ఎలా చేయాలని పలువురు కాంట్రాక్టర్‌లు వాపోతున్నారు. పట్టణ ప్రగతి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేయాలని పాలకవర్గ సభ్యులు, కాంట్రాక్టర్లు, డిమాండ్ చేస్తున్నారు.

ప్రగతి నిధులు ఇలా

మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి, సుందరీకరణ, పనులు, పారిశుధ్యం, పచ్చదనం, విద్యుత్ సదుపాయం లేని ప్రాంతాలలో విద్యుద్ధీకరణ పనులు మురుగుకాల్వల మెరుగు వంటి పనులను ఈ నిధులతో చేపట్టేందుకు అవకాశముంటుంది. విద్యుత్ బిల్లులను కూడా ఈ నిధుల నుంచే చెల్లించవల్సి వచ్చేది.

జనాభా ఆధారంగా నిధులు

జనాభా ఆధారంగా పట్టణ ప్రగతి నిధులను కేటాయిస్తారు. 2020 నుంచి నిధులను విడుదల చేస్తున్నారు. 2023 జూలై నుంచి ఆగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేసేది. ఎన్ని నిధులు విడుదల చేసేది ప్రభుత్వం ముందుగానే మున్సిపాలిటీలకు తెలియపర్చేది. ఆ ప్రకారంగా పనులను చేపట్టేవారు. తాండూరు మున్సిపాలిటీలో 2011 జనాభా ప్రకారంగా 71,008 మంది జనాభా ఉండగా ప్రతినెల రూ.25లక్షలు పట్టణ ప్రగతి గ్రాంటు వచ్చేది. ఎనిమిది నెలలుగా నిలిచిపోవడంతో ఒక్క తాండూరు మున్సిపాలిటీకే రూ.2 కోట్లు నిలిచిపోయాయి. దీంతో అభివృద్ధి కుంటుపడుతోంది. చిన్న మున్సిపాలిటీలైన కొడంగల్, పరిగిల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పట్టణ ప్రగతిని కొనసాగుతుందా..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 3నెలలు కావస్తున్నా పట్టణ ప్రగతి కార్యక్రమానికి నిధుల కేటాయింపు విషయంలో ఎలాంటి స్పష్టతరాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని నిధులను కలిపి పట్టణ ప్రగతి గ్రాంటుగా విడుదల చేసేది. కొత్త ప్రభుత్వంలో పాత విధానం ద్వారా నిధులు విడుదల చేస్తారా.. లేదా అనే అంశం ఏప్రిల్‌లో తేలనుంది.

పనులకు ఆటంకం

పట్టణప్రగతి ప్రధాన లక్ష్యం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుధ్య పనులు చేపట్టాల్సి వుంటుంది. అదేవిధంగా మౌలిక సదుపాయాలు, హరితహారం కింద మొక్కల పెంపకంతో పచ్చదనం పెంపొందించాలి. కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఈ పనులకు ఆటంకం ఏర్పడుతోందని పాలక మండలి సభ్యులు చెబుతున్నారు. నిధులు విడుదల కాక పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదు. పలు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్‌లు చేతులెత్తేస్తున్నట్లు సమాచారం. దీంతో ఆయా పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఏసీపీ రాజు

కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు

● ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 26: కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు వస్తాయని, తద్వారా తల్లిదండ్రులు కన్న కలలుకూడా సాకారమవుతాయని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం సమీపంలోని చెర్లపటేల్‌గూడలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో పీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యంవైపే ముందుకు సాగాలని ఏసీపీ సూచించారు. సెల్‌ఫోన్ల వాడకం, చాటింగ్‌లకు దూరంగా ఉండాలని అన్నారు. సమయం ఎంతో విలువైందని, దీనిని గమనంలో పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : వీర్లపల్లి

నందిగామ, ఫిబ్రవరి 26: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామనేఇ వివరించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేల కుటుంబాలే బాగుపడ్డాయి తప్పా సామాన్య ప్రజలకు ఒనగూరింది ఏమీ లేదన్నారు. అనంతరం మండల కేంద్రం నుంచి బైపాస్ రోడ్డు వరకు అర్ధాంతరంగా ఆగిపోయిన రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్డు పనులకు రూ.40లక్షల హెచ్ఎండీఏ నిధులు ఇప్పించినట్లు ఆయన తెలిపారు. ఎంపీపీ ప్రియాంక శివశంకర్‌గౌడ్, వైస్ ఎంపీపీ తలసీరామ్ నాయక్, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేవపల్లి కుమార్ గౌడ్, తహసీల్దార్ రాజేశ్వర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు యాదవ్, రాజగోపాల్, అశోక్, పాండు రంగారెడ్డి, బాల్‌రెడ్డి, రామ్‌రెడ్డి, అంజు యాదవ్, దారలింగం, తుమ్మల నర్సింలు, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, విగ్నేష్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, అంజయ్య యాదవ్, శ్రవణ్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



కొత్తూర్ : తీగాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

కొత్తూర్ : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని తీగాపూర్ గ్రామంలో రూ.50లక్షలతో నిర్మించతలపెట్టిన తీగాపూర్-పాతిమాపూర్ సీసీ రోడ్డు పనులను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ అంచలంచెలుగా పరిష్కారిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రజలు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణ, ఎంపీటీసీ బి.జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, నాయకులు మెండె నర్సింహ, కృష్ణ, జి.రాజు, ఆంజనేయులు, జనార్దన్, జంగయ్య, శేఖర్, చెన్నయ్య ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు-క్రూయిజర్ ఢీ.. ఇద్దరు దుర్మరణం

● పలువురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

● మంచాల మండల పరిధి సాగర్ రహదారిపై ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు, క్రూయిజర్ ముందుభాగాలు



ప్రేమ్‌కుమార్(ఫైల్)

మంచాల, ఫిబ్రవరి 26 : కారు-క్రూయిజర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా పలువురికి గాయాలైన ఘటన మంచాల పోలీస్‌స్టేషన్ పరిధి ఆగాపల్లి సాగర్ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఆగాపల్లికి చెందిన వంగూరి ఎర్రేష్(38) స్విఫ్ట్ కారులో ఇబ్రహీంపట్నం నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈక్రమంలో ఆగాపల్లి శివారు క్రషన్ మిషన్ సమీపంలో సాగర్ రహదారిపై హైదరాబాద్ వెళ్తున్న క్రూయిజర్-కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఎర్రేష్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. క్రూయిజర్‌లో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయుడు ప్రేమ్‌కుమార్(55) కూడా దుర్మరణం చెందాడు. క్రూయిజర్ డ్రైవర్ శివ కాళ్లు విరిగాయి. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా, మాడ్గుల మండలం నాగిళ్ల, కొల్కులపల్లిలోని జడ్పీ హైస్కూళ్లలో పనిచేసే ఎనిమిది మంది ఉపాధ్యాయులు రోజూ క్రూయిజర్‌లో హైదరాబాద్ నుంచి వచ్చి వెళ్తుంటారు. ప్రేమ్‌కుమార్(ఆంగ్లం టీచర్) కొల్కులపల్లి జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తుంటాడు. డ్రైవర్ శివది నాగిళ్ల గ్రామం. కాగా, మంచాల సీఐ బాబ్యానాయక్, ఎస్సై సతీష్‌లు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఎర్రేష్, ప్రేమ్‌కుమార్ మృతదేహాలను ఇబ్రహీంపట్నం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

కొత్తూర్, ఫిబ్రవరి 26: మండల పరిధిలోని తిమ్మాపూర్ వద్ద చేగూర్ చౌరస్తా 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో జీతాలాల్‌రాం(35) అనే కూలీ మృతి చెందాడని ఎస్సై జి.శ్రీనివాస్ తెలిపారు. బీహార్‌కు చెందిన జీతాలాల్‌రాం ఐవోసీఎల్ పరిశ్రమలో ఆటో ట్రాలీ కూలీగా పనిచేస్తూ తిమ్మాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో తిమ్మాపూర్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు. మృతుడి మామ గగన్‌దేవ్‌రాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 26 : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వినాయక రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని బ్లూడ్స్ వెంచర్‌లో నివాసముంటున్న సునీల్‌కుమార్ ఈనెల 22న కుటుంబంతో కలిసి ఇంటికి తాళంవేసి మొయినాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి ఆదివారం రాత్రి ఇంటికి రాగానే తాళం విరగ్గొట్టి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకున్నారు. గుర్తుతెలియని దొంగలు తాళం విరగ్గొట్టి 15తులాల బంగారం, రూ.30వేలు ఎత్తుకెళ్లినట్లు యాజమాని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శంషాబాద్‌లో వ్యభిచార కేంద్రం గుట్టురట్టు

● నిర్వాహకురాలు, ఇద్దరు విటుల అరెస్టు

శంషాబాద్, ఫిబ్రవరి 26: శంషాబాద్‌లో వ్యభిచార కేంద్రం నిర్వాహకురాలిని, ఇద్దరు విటులను అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్టు ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు. సీఐ బాల్‌రాజ్ విలేకరులకు వివరాలను వెల్లడించారు. శంషాబాద్‌లోని రాజీవ్ గృహకల్ప ఇళ్లలో ఖమ్మం నుంచి వచ్చిన కోటీశ్వరి అనే మహిళ ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటోంది. మహేశ్వరం మండలానికి చెందిన ఓ మహిళతో వ్యభిచారం నెరుపుతోంది. సమాచారం అందుకున్న పోలీసులు కోటీశ్వరి ఉంటున్న ఇంటిపై దాడిచేసి శంషాబాద్ హైమాద్‌నగర్ బస్తీకి చెందిన ఇద్దరు విటులను, కోటీశ్వరిని అరెస్టు చేశారు. 3 కండోమ్ ప్యాకెట్లు, 3,600 నగదు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిచారు. కాగా, ఇల్లు అద్దెకిచ్చే ముందు వారి వివరాలు, ఆధార్‌కార్డు తీసుకొని అనుమానంలేదని నిర్ధారించుకోవాలని సీఐ బాల్‌రాజ్ సూచించారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

కడ్తాల్, ఫిబ్రవరి 26 : మండల పరిధిలోని రాజీవ్ నగర్ తండాకు చెందిన శోభన్‌కు తండావాసులు చేయూతనందించారు. గతేడాది విద్యుదాఘాతానికి గురైన శోభన్ మంచానికే పరిమితమయ్యాడు. దాంతో అతడి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటోంది. ఈ విషయం గమనించిన స్థానిక నాయకులు శోభన్‌కు చేయూతనందించారు. తలా కొంత డబ్బు పోగుచేసి రూ.26వేలు జమ చేశారు. సోమవారం ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, రవి, తులసీ రామ్, నాను, గణేశ్, భాస్కర్, దస్రు, కిషన్, మోహన్, శివ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పదవులకు రాజీనామా చేసి పార్టీ మారాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 26 : బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచిన వారు పార్టీ మారాలనుకుంటే తమ పదవులకు రాజీనామా చేసి వేరే పార్టీలో చేరాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, శంకర్‌పల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి పార్టీ గుర్తుపై గెలిచిన కౌన్సిలర్లు పదవులకు రాజీనామా చేయాలని అధికారం చేజారి 70రోజులు కాకముందే పార్టీ ఫిరాయింపులు సరైనవి కావని అన్నారు. కౌన్సిలర్లు శ్వేత, పార్వతి రాధ, లక్ష్మమ్మ, శ్రీనాథ్‌గౌడ్, చంద్రమౌళి, అశోక్, గోపాల్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి కల్యాణం



ఆమనగల్లు : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 26 : పట్టణంలోని అయ్యప్ప కొండపైగల శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలోని శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు, శివస్వాములు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నిర్వాహకుడు రేగట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాపిశెట్టి శ్వేతరాము, ఆకుతోట రాధికశ్రీనివాస్, రేగట్టి శ్రీనివాస్‌శ్రీలత దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు కల్యాణం జరిపించారు. అంతకుముందు ఆలయంలో ప్రథమ వార్షికోత్సవాలను నిర్వహించారు. మహాగణపతి పూజ, రుద్రాభిషేకం, గణపతి హోమం, స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.

దవళగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కేశంపేట : మండల కేంద్రంలోని దవళగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం పంచామృతాభిషేకం, అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. మార్చి 3 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

ముగిసిన లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్ : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. వారం రోజులపాటు ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరిగాయి. కడ్తాలతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు ఉత్సవాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ముగింపు వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, చక్రతీర్థం, గరుడ సేవ ఊరేగింపు, నాగవల్లి కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పాలాది ఆంజనేయులు, ఈవో మోహన్‌రావు, తదితరులున్నారు

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం

కడ్తాల్ : సమాజ శాంతిని కాక్షించి ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగాలని జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతికి, మానవాళి సన్మార్గ పురోగమనానికి దోహదపడుతాయని అన్నారు. కడ్తాల మండలం గాన్గుమర్ల తండాలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి దశరథ్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరై జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.1.25 లక్షలు విరాళం అందజేశారు. అదేవిధంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త మెగా మురళి రూ.1.16 లక్షలు, మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్ రూ.51 వేలు విరాళాలు అందించారు. నిర్వాహకులు వారిని సత్కరించారు. ఆర్ఎస్ఎస్‌జడ్ సభ్యుడు బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యనాయక్, నాయకులు పాండు, హరి, లక్ష్మణ్, రాజు, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్ : స్వామివారి గరుడ వాహన సేవలో పాల్గొన్న భక్తులు



శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జర్నలిస్టులు

రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌ను కలిసిన జర్నలిస్టులు

రంగారెడ్డి అర్బన్ : తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమితులైన ఇండియన్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, జంగయ్యలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు ఆయన్ను నగరంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

మాడ్గుల నూతన సీఐకి బీఆర్ఎస్ నాయకుల సన్మానం



మాడ్గుల, ఫిబ్రవరి 26 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ విష్ణువర్ధన్‌రెడ్డిని సోమవారం బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, రెడ్డి కృష్ణారెడ్డి, సూదిని తిరుమల్‌రెడ్డిలు సీఐని శాలువాతో సన్మానించారు.

చేవెళ్లలో బీఆర్ఎస్ కనుమరుగు ఖాయం : భీంభరత్



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల, ఫిబ్రవరి 26 : రాబోయే రోజుల్లో చేవెళ్లలో బీఆర్ఎస్ కనుమరుగవ్వడం ఖాయమని, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మల్కాపూర్‌లోని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బక్కరెడ్డి యాదిరెడ్డి, సీహెచ్ వెంకటేశ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. భీంభరత్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఇతర పార్టీల నేతలు ఆకర్షితులై పార్టీలో భారీగా చేరుతున్నారని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, పీఆర్ చాంబర్స్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, అశోక్, శివకుమార్ గుప్త, మహేందర్‌గౌడ్, వెంకటేశ్, జంగయ్య, యాదగిరిగౌడ్, శంకరయ్య, మల్లారెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 26: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. పంచాయతీల సిబ్బందికి 5నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, రూ.5లక్షల బీమాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీ కార్మికులు కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. భారీసంఖ్యలో కార్మికులు, యూనియన్ అధ్యక్షుడు పాండు, గౌరవాధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, రాష్ట్ర కార్యదర్శి పి.సుధాకర్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, నాయకులు శేఖర్, గోపాల్, నర్సింహ, బుగ్గరాములు, దేవేందర్, దేవదాసు, అశోక్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన, ధర్నాలో పాల్గొన్న పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు




ప్రింటర్‌ను అందజేస్తున్న ప్రశూల్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

షాబాద్, ఫిబ్రవరి 26 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందు కు రావాలని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీవాచ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు హన్మంత్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రశూల్‌రెడ్డి ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డిని ప్రిన్సిపాల్ అభినందించారు. ఉపాధ్యాయులు రాఘవేందర్, వెంకటేశ్వర్లు, రబియా, ట్రస్ట్ సభ్యులు శివకుమార్, సత్యనారాయణరెడ్డి, అస్మత్‌పాషా, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షబ్-ఏ- బరాత్

ఆమనగల్లు/కడ్తాల్, ఫిబ్రవరి 26 : పట్టణంలోని జామా మజీద్‌లో షబ్-ఏ-బరాత్ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ముస్లింలు నమాజ్ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జాగరణ చేసి ఖురాన్ పఠనం గావించారు. ఇమామ్ అబ్దుల్ వాహేద్ ఆధ్వర్యంలో దువ్వ కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా కడ్తాల మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు షబ్-ఏ-బరాత్ వేడుకలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని మజీద్‌ఖుబా, మసీద్ అర్షద్‌లలో ఇమామ్‌లు జహీరోద్దీన్, మహ్మద్ తాజీబ్‌ల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. మజీద్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రాహూప్, అహ్మద్ జానీ, ఉపాధ్యక్షులు జావేద్, మండల కో-ఆప్షన్ సభ్యులు జహంగీర్‌బాబా, అష్రఫ్, అబ్దుల్‌వాహెబ్, ఆసిఫ్‌అలీ, ఈర్షద్, షకీల్, అనీస్, మహబూబ్, యూనస్ తదితరులున్నారు.



ఆమనగల్లు : మాట్లాడుతున్న అబ్దుల్ వాహేద్

మల్లు రవికి పార్లమెంట్ టికెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న రవీందర్ నాయక్

ఆమనగల్లు, ఫిబ్రవరి 26: పదవులు ఉన్నా.. లేకపోయినా నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ నిస్వార్థ సేవలందిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవికి నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్‌ను కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు రవీందర్ నాయక్ కోరారు. పార్లమెంట్ పరిధిలో సర్వే నిర్వహించిన ప్రజాభీష్టానికనుగుణంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టిక్కెట్ కేటాయించాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మండ్లీ రాములుతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రవీందర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో మల్లు రవి క్రియాశీలక పాత్ర పోషించారని అన్నారు. ఏళ్ల కాలంగా సీఎం రేవంత్‌రెడ్డి కి అండగా ఉంటూ పార్టీ అభివృద్ధి విశేషంగా కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా రెండు ప ర్యాయాలు ఎంపీ స్థానాన్ని ఇతరులకు కేటాయించిన అధిష్టానం ఆదేశానికి కట్టుబడి రవి పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. నాయకులు అంజినాయక్, శంకర్, సురేశ్ , తదితరులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్యపై విచారణ వేగవంతం

యాచారం, ఫిబ్రవరి 26 : హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో పదోతరగతి చదువుతున్న బాలిక(14) ఆత్మహత్యపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఈనెల 23న ఇంట్లో బాలిక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంగతి పాఠకులకు విదితమే. పోలీసులు ఆమె చదివే పాఠశాలలో ఉపాధ్యాయులను, క్లాస్‌మేట్స్‌ను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె తరగతిలో ఎలా ఉండేది? ఎలా చదివేది? తదితర వివరాలను ఎస్సై నరేష్ సిబ్బందితో ఆరా తీస్తున్నారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

సంక్షిప్తంగా..

● **ఆమనగల్లు** : విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని ఏడీఈ శ్రీనివాస్, ఏఈ సీతారామ్‌లు కోరారు. ఆమనగల్లు విద్యుత్‌శాఖ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

● **కందుకూరు** : కాంగ్రెస్ గూడూరు గ్రామ అధ్యక్షుడిగా ఐనవోలు శ్రీకాంత్‌రెడ్డిని నియమించినట్లు మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్ ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా గోల్కొండ సాయిలు, ప్రధానకార్యదర్శిగా నర్ల రాఘవేందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోల్దాస్ అరవింద్, ఉపాధ్యక్షుడిగా చిలుకల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాము, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కొందుర్గు : మండల పరిధిలోని ఉత్తరాస్ పల్లి శివనామస్మరణతో మారుమ్రోగింది. సోమవారం గ్రామంలో శివ స్వాములు భక్తిశ్రద్ధలతో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. గురుస్వామి భూపాలాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **మంచాల** : జాపాల జడ్పీ హైస్కూల్ 2010-11బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకచోట కలిసి తమ పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్‌కుమార్

'కాంగ్రెస్‌తోనే బలహీన వర్గాల అభివృద్ధి'

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 26 : కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి, మాజీ ఎంపీటీసీ అశోక్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీని విడిచి సునీతామహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆమె నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆమె వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు సంతోష్, నాయకులు ప్రకాశ్‌గుప్తా, మధు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో ఆమనగల్లు విద్యార్థినుల ప్రతిభ



ఐశ్వర్య రెడ్డి, లక్ష్మీప్రియలను సన్మానిస్తున్న అల్లాజీగౌడ్, సుదర్శన్‌రెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 26: రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో ఆమనగల్లు పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ టెక్నోస్కూల్ విద్యార్థిని మ్యాక ఐశ్వర్య రెడ్డి అత్యంత ప్రతిభ కనబరిచింది. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించింది. హైదరాబాద్ కూకట్‌పల్లి పీఎస్ఆర్ పాఠశాలలో విశ్వం ఎడ్యూటెక్ స్కూల్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన 170 పాఠశాలల నుంచి 400 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో టాపర్లుగా నిలిచిన ఆమనగల్లు లిటిల్ స్కాలర్స్ టెక్నోస్కూల్ 7వ తరగతి విద్యార్థిని మ్యాక ఐశ్వర్యరెడ్డి వేదిక్ మ్యాథ్స్ పోటీలో, 2వ తరగతి విద్యార్థిని ఇ. లక్ష్మీప్రియ అబాకస్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. సోమవారం పాఠశాలలో చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్, కరస్పాండెంట్ సుజాతరెడ్డి, డైరెక్టర్ సావిత్రి, అకాడమిక్ అడ్వైజర్ సుదర్శన్‌రెడ్డిలు వారిని సత్కరించి అభినందించారు.

విచారణ కొనసాగుతోంది : షాద్‌నగర్ ఏడీఏ

కొందుర్గు, ఫిబ్రవరి 26: మండల పరిధిలోని ఆగిర్యాల(తంగళ్లపల్లి) క్లస్టర్ ఏఈవో శ్రీశైలం కేసు విచారణ కొనసాగుతుందని షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో విలేకరులతో మాట్లాడారు. కేసు గురించి ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారని, పోలీసులు విచారణ చేస్తున్నారని, విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. మండల వ్యవసాయాధికారి మధుసూదన్ ఉన్నారు.